మండే కాలం.. జాగ్రత్త సుమా..

- వేసవిలో తరచుగా సంభవించే అగ్నిప్రమాదాలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు
- ప్రతి ఒక్కరూ అత్యవసర ఫోన్ నంబర్లు నోట్ చేసుకోవాలి
- ప్రమాదాల నివారణలో అధికారులతో సహకరించాలి



అల్లిపురం: వేసవిలో **జరిగే అగ్ని ప్రమాదాల** కారణంగా ఏటా భారీగా **ప్రాణ, ఆస్తి నష్టం జరుగు**తుంది. ఇతర సమయాల్లో **కన్నా వేసవిలో అధిక** ప్రమాదాలు జరుగుతు**ంటాయి. ప్రమాద** సమయంలో అప్రమత్తంగా **ఉంటే నష్టాన్ని కొద్దిగా** తప్పించగలం. ఈ ఏడాది వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో అగ్ని ప్రమాదాలు కూడా ఎక్కువయ్యే అవకాశం ఉన్నందున అగ్ని ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం.

ముందు జాగ్రత్తలు తప్పనిసరి..

ప్రతి చోటా అగ్ని ప్రమాదాలు జరుగుతాయని అనుకోలేం. అయినా అన్ని చోట్లా ముందు జాగ్రత్తలు తప్పనిసరి. ఇప్పుడు విద్యుత్ వినియోగం బాగా పెరిగిపోయింది. బయటికి కనిపించకుండా ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ వైరింగ్ వ్యవస్థలను క్రమం తప్పకుండా పరిశీలించాలి. వీటిని ఏర్పాటు చేసేటప్పుడే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. నాణ్యమైన సామగ్రినే ఉపయోగించాలి. ఐఎస్ఐ మార్కు కలిగిన వాటినే వాడటం ఉత్తమం.

అపార్టుమెంట్లో మంటలు కనిపిస్తే ఏం చేయాలి?

అపార్టమెంట్లో నివసిస్తున్నవారు మంటలు కనిపిస్తే వెంటనే అక్కడి నుంచి బయటికి దారితీసే ఎగ్జిట్ మార్గాలను గుర్తుకు తెచ్చుకోండి. బయటికి వెళ్లే ముందు సత్వరం గ్యాస్ సిలండర్లు, విద్యుత్ సరఫరా వ్యవస్థను నిలిపివేయండి.

➡ మీరుండే అపార్టుమెంట్లోకి పొగ వస్తుంటే, నోటికి ఏదైనా వస్త్రం అడ్డం పెట్టుకుని బయటికి వెళ్లండి. అది తడిగుడ్డ అయితే మరీ మంచిది. పొగ మరీ ఎక్కువగా ఉంటే ఎగ్జిట్ వైపు వెళ్లి ప్రాణాలు కాపాడుకోవాలి.

మాల్‌లో ఉంటే ఎలా?

నగరీకరణలో మాల్స్ కల్చర్ ఇప్పుడిప్పుడే మొదలవుతుంది. మాల్స్‌లోను అగ్నిప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉంది. ప్రతి షాపింగ్ మాల్‌లోనూ అగ్ని ప్రమాద నియంత్రణ వ్యవస్థ ఉంటుంది. లాబీలో రిసెప్షన్‌కు దగ్గర్లో మాల్ మ్యాప్ మొత్తం ఉంటుంది. లోపలికి ప్రవేశించే, బయటికి వెళ్లే మార్గాలను, అత్యవసర మార్గాలను ఇది సూచిస్తుంది.

➡ మాల్ ప్రతి ఫ్లోర్‌లో కూడా బయటికి వెళ్లే మార్గాన్ని సూచిస్తూ ఫ్లోరోసెంట్ కలర్‌లో ఎగ్జిట్ గుర్తు ఉంటుంది. దాని ఆధారంగా బయటపడండి.

➡ రద్దీ ఎక్కువగా ఉండే మాల్ లాంటి ప్రదేశాల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు కంగారుపడకుండా, అయోమయానికి గురి కాకుండా ఉండాలి. గందరగోళం ఏర్పడితే తొక్కిసలాటకు దారి తీస్తుంది. అది అగ్నిప్రమాదం కంటే పెద్ద దుర్ఘటనకు కారణం కావొచ్చు.

➡ మాల్‌లో ఎక్కడైనా మంటలు కనిపిస్తే వెంటనే గార్డులను అప్రమత్తం చేయండి. అక్కడుండే మంటలార్పే సాధనాలతో చిన్నస్థాయి మంటలను అదుపు చేయవచ్చు.

హోటల్ లేదా రెస్టారెంట్‌లో ఉంటే..

రద్దీగా ఉండే చోట్లకు వెళ్లకపోవడమే ఉత్తమం. ఇరుకైన ప్రదేశాల్లో ఉండే హోటళ్లు, రెస్టారెంట్లకు వెళ్లకపోవడం మేలు. ఒక వేళ అలాంటి చోటుకు వెళ్లినప్పుడు అగ్నిప్రమాదం జరిగితే, ఎలాంటి గందరగోళం సృష్టించకుండా సాధ్యమైనంత త్వరగా అక్కడి నుంచి బయటపడేందుకు ప్రయత్నించండి.



సూర్యాబాగ్‌లో గల అగ్నిమాపక కేంద్రం

గ్యాస్ సిలిండర్ల విషయంలో జాగ్రత్తలు..



వేసవిలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. వాతావరణంలో ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండటం వల్ల గ్యాస్ చాలా త్వరగా వ్యాప్తి చెందుతుంది. కాబట్టి ఎన్ని పనులున్నా గ్యాస్ మీద ఓ కన్ను వేసి ఉంచడం మంచిది. గ్యాస్ సిలిండర్ వినియోగం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వంట గదిలో తగినంత గాలి, వెలుతురు ఉండేలా చూసుకోవాలి. గ్యాస్ సిలిండర్‌కు దగ్గరగా ప్లాస్టిక్ వస్తువులు, మంటలు త్వరగా వ్యాప్తి చెందే వస్తువులను ఉంచకూడదు. గ్యాస్ సిలిండర్ ఉపయోగించనప్పుడు రెగ్యులేటర్ నాబ్‌ను ఎప్పుడూ ఆఫ్‌లో ఉంచాలి.

అగ్నిమాపక కేంద్రాల ఫోన్ నంబర్లు
101, 112,
విశాఖపట్నం: 0891-2563582, 2787818, 9963728301

మంటలు అంటుకున్నప్పుడు..

అగ్నిప్రమాదం జరగగానే 101కి సమాచారం ఇవ్వాలి. చిరునామా, ఫోన్ నంబరు, ఉండుతున్న వివరాలను స్పష్టంగా చెప్పాలి. ఇంట్లో ప్రమాదం జరిగితే అందరినీ బయటికి పంపించండి. విద్యుత్ పరికరాలకు మంటలు వ్యాపిస్తే, వాటిపై నీళ్లు చల్లకుండా విద్యుత్ సరఫరాను నిలిపివేయాలి. ఫైరింజన్ వచ్చే వరకు స్థానికుల సహకారంతో పరిస్థితి విషమించకుండా జాగ్రత్తపడాలి. మంటలు అంటుకుని ఇంటి నిండా పొగ నిండితే ముఖం, ముక్కుకు గుడ్డ కటుకుని నేలపై పాక్కుంటూ బయటికి రావాలి.



అగ్నిప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండాలి..



అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్ బుల్లెట్లు, రెస్క్యూ టెండర్లు, అడ్వాన్స్ వాటర్ టెండర్లు, బ్రౌజర్, ఫోమ్ టెండర్లు సిద్ధంగా ఉంచాం. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా అందరూ అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు, కాలేజీలు, ఆస్పత్రుల్లో ప్రమాద నిరోధక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలి. ఎప్పటికప్పుడు వాటి ఎక్స్‌పైరీ తేదీలు చెక్ చేసుకోవాలి. అందుబాటులో అగ్నిమాపక శాఖ ఫోన్ నంబర్లు పెయింట్ చేయించుకోవాలి. గాలి, వెలుతురుతో పాటు, ఎగ్జిట్, ఎమర్జెన్సీ ఎగ్జిట్లు విశాలంగా ఉండేలా చూసుకోవాలి.

– పి. సింహాచలం, జిల్లా అగ్నిమాపక అధికారి

క్లుప్తంగా

ఉపాధి కోర్సుల్లో ప్రవేశాలకు ఆహ్వానం

డాబాగార్డెన్స్: ఉపాధి అవకాశాలు గల పలు కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్వస్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అలైడ్ సైన్సెస్ ప్రతినిధి డాక్టర్ హరిత పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆల్టర్‌నేటివ్ థెరపీస్, కాస్మొటాలజీ కోర్సుల్లో అపారమైన అనుభవం ఉన్న స్వస్థ ఇనిస్టిట్యూట్ విద్యార్థులకు సువర్ణ అవకాశం కల్పిస్తోందన్నారు. ఏడాది కోర్సులో శిక్షణతో పాటు ఉన్నత ప్రమాణాలు పాటిస్తూ ఇంటర్న్‌షిప్ కూడా కల్పించనున్నట్లు చెప్పారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు ఏడాది పాటు ఈ కోర్సులో శిక్షణ అందివ్వనున్నట్లు తెలిపారు. సెంచూరియన్ యూనివర్సిటీతో అనుబంధం కలిగి పోస్టు గ్రాడ్యుయేట్, డిప్లొమా కోర్సులు అందిస్తుందన్నారు. అలాగే కాస్మొటాలజీ, హెల్త్‌కేర్ విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమాలో డైట్ అండ్ న్యూట్రిషన్ కోర్సులు ప్రారంభించినట్లు హరిత చెప్పారు.

పేద మహిళకు నిత్యావసర సరుకుల అందజేత



వృద్ధురాలికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 30వ వార్డు వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు సురకల వేణుగోపాల్ శనివారం జాలారిపేటలో ఒంటరిగా నివసిస్తున్న వృద్ధ పేద మహిళకు నిత్యావసర సరుకులు అందజేశారు. 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులతో పాటు చీర అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దశమంతుల మాణిక్యాలరావు, దశమంతుల చిన్ని, కేవీఎస్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కోన శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నరసింహ యజ్ఞం

తాటిచెట్లపాలెం: శ్రీ నరసింహ జయంతిని పురస్కరించుకుని ఆదివారం సీతమ్మధార శ్రీకృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు హరేకృష్ణ మూవ్‌మెంట్ యదురాజా దాస స్వామీజీ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 నుంచి 6.30 గంటల వరకు నరసింహ యజ్ఞం, 6.30 నుంచి 7 గంటల వరకు పూర్ణాహుతి, శాంతి వచనం, రాత్రి 7 నుంచి 7.30 గంటల వరకు నరసింహ లీలా ప్రవచనం, 7.30 నుంచి 8 గంటల వరకు మంగళ హారతి, సంకీర్తన, 8 గంటలకు తీర్థప్రసాద వితరణ జరుగుతాయని చెప్పారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం నేడు

తాటిచెట్లపాలెం: జేపీసీ జోన్-4 పాలూరి శేషమాంబ ఫౌండేషన్, వీ హెల్త్ కేర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం శంకరమఠం రోడ్డులోని వీ హెల్త్ కేర్‌లో ఉచిత వైద్య శిబిరం, గుండె ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జోన్-4 చైర్మన్ వినీత్ కుమార్ జైన్ తెలిపారు. శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, గుండె సంబంధిత వైద్య పరీక్షలు చేస్తారన్నారు. గుండె వైద్య నిపుణుడు డాక్టర్ ఎస్ఎస్ పెన్నేరు సుబ్రహ్మణ్యం వైద్య సేవలందిస్తారని చెప్పారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు వైద్య శిబిరం జరుగుతుందని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని వినీత్‌కుమార్ కోరారు.

విహారయాత్రలకు విరామమివ్వాలి

తాటిచెట్లపాలెం: దేశంలో ఉన్న అత్యవసర పరిస్థితుల దృష్ట్యా నగరవాసులు కొంత కాలం విహార యాత్రలకు విరామమివ్వడం మంచిదని ఈస్ట్ కోస్ట్ రైల్వే అర్బన్ బ్యాంక్ డెలిగేట్, అక్కినేని యువసేన అధ్యక్షుడు కె.శ్రీనివాస్ సూచించారు. వేసవి సెలవుల నేపథ్యంలో చాలామంది ఆయా ప్రాంతాలకు విహార యాత్రకు ప్లాన్ చేసుకుంటారని, దేశంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల నేపథ్యంతో వీటిని విరమించుకోవడం మంచిదన్నారు. కశ్మీర్ పహల్గామ్‌లో పర్యాటకులపై దాడులకు సమాధానంగా మన దేశం ఆపరేషన్ సిందూర్ నిర్వహిస్తున్నందున.. భారత సైనికులకు ఆటంకంగా ఉండకుండా ఉండేందుకు ప్రజలు తమ పర్యటనలను వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మనందరి క్షేమం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతని, ఈ సమయంలో వారు ఇచ్చిన సూచనలను పాటిస్తూ, ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొంటున్న సైనికుల కోసం, ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న భారత పౌరుల కోసం ప్రత్యేకంగా ప్రార్థించాలని శ్రీనివాస్ కోరారు.

సిరులతల్లికి తులసిపూజ



తులసిపూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహా**లక్ష్మి అమ్మవారి దేవస్థా**నంలో శనివారం తులసి **పూజ నిర్వహించారు. ఉ**దయం 7 నుంచి 8 గంటల **వరకు నిర్వహించిన ఈ** పూజలో పలువురు ఉభ**యదాతలు పాల్గొన్నారు**. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భారత్‌కు మద్దతుగా సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న స్వామి వివేకానంద సంస్థ ట్యూషన్ విద్యార్థులు

డాబాగార్డెన్స్: భారత్–పాక్ యుద్ధంలో భారత్ విజయాన్ని కాంక్షిస్తూ స్వామి వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఆర్‌కే బీచ్ నుంచి పాతనగరంలోని స్వామి వివేకానంద సంస్థ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పొడవునా మువ్వెన్నల జెండా చేత పట్టి.. జయహో భారత్ సైన్యమంటూ సంస్థ ట్యూషన్ విద్యార్థులు నినదించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వీరనారీమణుల విశ్వరూపం అభినందనీయం

ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వెటరన్ ఫ్లైట్ లెఫ్టినెంట్, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: ఆపరేషన్ సిందూర్‌లో వీరనారీమణుల విశ్వరూపం అభినందనీయమని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వెటరన్ ఫ్లైట్ లెఫ్టినెంట్, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కొనియాడారు. ఆశీల్‌మెట్టలోని తన కార్యాలయంలో శనివారం ఆపరేషన్ సిందూర్‌పై మాట్లాడారు. పాకిస్తాన్ ఉగ్రవాదుల శిబిరాలను మన వీరనారులు ధ్వంసం చేశారని, హఫీజ్ కుటుంబాన్ని, 98 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టడంలో మన వీరనారులు కల్నల్ సోఫియా ఖురేషి, వ్యోమిక సింగ్, కనకదుర్గ అమ్మవార్లలా విశ్వరూపం చూపారన్నారు. బుల్లెట్‌కి బుల్లెట్‌తోనే సమాధానం ఇవ్వడం సరైన నిర్ణయమన్నారు. మన ఎస్400 సుదర్శన్ చక్రంలా భారతదేశం వైపు పాకిస్తాన్ చేస్తున్న దొంగదెబ్బను అడ్డుకోవడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. మహిళలు అయినప్పటికీ ఎంతో ధైర్యంగా పాకిస్తాన్ ఉగ్రవాదులను, వారి శిబిరాలను తునాతునకలు చేశారన్నారు. దొంగ దెబ్బ తీస్తున్న పాకిస్తాన్‌కు దిమ్మదిరిగే విధంగా మన సైనికులు షాక్ ఇస్తున్నారన్నారు. కల్నల్ సోఫియా ఖురేషి, వ్యోమికా సింగ్ వంటి వారిని విద్యార్థులు, మహిళలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వీరమరణం పొందిన మన తెలుగు జవాన్ మురళీ నాయక్‌కు అశ్రునివాళులర్పిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా జవాన్ మురళీ కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. ఇప్పటికే భారతదేశానికి అన్ని ప్రపంచ దేశాల మద్దతు ఉందని, ఇదే సమయంగా పాకిస్తాన్ ప్రపంచ పటంలోనే లేని విధంగా గట్టి దాడి చేయాలన్నారు. సింధూ నది నీళ్లు ఆపడం, ఆహార కొరతతో ఇప్పటికే పాకిస్తాన్ కుదేలైందన్నారు. ఏ దేశం కూడా సాయం చేయకపోయినప్పటికీ పాకిస్తాన్ దొంగ దాడులు చేస్తోందన్నారు. కాశ్మీర్లో ఆక్రమించుకున్న భూభాగాన్ని మొత్తం భారతదేశం కైవసం చేసుకోవాలన్నారు. ఆపరేషన్ సిందూర్ స్ట్రైక్‌లో టాప్–5 ఉగ్రవాదులను భారత్ హతం చేయగలిగిందన్నారు. యుద్ధం పూర్తి స్థాయిలో జరిగితే పాకిస్తాన్ ప్రపంచ పటంలోనే లేకుండా చేయడానికి మన సైనికులు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశవ్యాప్త బంద్ విజయవంతానికి పిలుపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిటు ప్రధాన కార్యదర్శి కుమార్ తదితరులు

డాబాగార్డెన్స్: ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు.. జీవో 21 ఉపసంహరణ, ఆర్టీవో చలానాల తగ్గింపు, లేబర్ కోడ్స్ రద్దు వంటి వాటిని కోరుతూ ఈ నెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని సిటు ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఇప్పటి వరకు జరిగిన సమ్మెలకు, ఇప్పుడు జరుగుతున్న ఈ సమ్మెకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. 16 డిమాండ్లలో అన్నింటికన్నా ముఖ్యమైనది లేబర్ కోడ్లు రద్దు చేయడమన్నారు. లేబర్‌కోడ్‌లు అమల్లోకి వస్తే కార్మికులకు చట్టాలు వర్తించని (షెడ్యూల్, నాన్ షెడ్యూల్) కార్మికులందరూ బానిసత్వంలోకి నెట్టబడతారన్నారు. వీటితో పాటు ఆటో కార్మికులకు ఉరితాడు వంటి మోటార్ ట్రాన్స్‌పోర్టు సవరణ చట్టం 2019ను రద్దు చేయాలని, పెంచిన చలానా చార్జీలు తగ్గించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ 11 కేంద్ర కార్మిక సంఘాలు ఈ నెల 20న ఆటోబంద్‌కు పిలుపునిచ్చాయన్నారు. కార్మికులు ఈ బంద్‌లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆటో రిక్షా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, జిల్లా నాయకులు రెడ్డి, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

బల్లిగిరి వెంకన్నకు విశేష పూజలు



బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు శనివారం భక్తులు బారులు తీరారు. వైశాఖ మాసం రెండవ శనివారాన్ని పురస్కరించుకుని భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు తెల్లవారు జాము నుంచి తరలి వచ్చారు. మధుర ఫలం మామిడి పండ్లను భక్తులు పెద్ద ఎత్తున సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు గొడవర్తి వీర రాఘవాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు, సహస్ర నామాభిషేకాలు చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారి ఆలయం చుట్టూ 108 సార్లు ప్రదక్షిణ చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు నృసింహ జయంతి..

కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం నృసింహ జయంతి సందర్భంగా స్వామి వారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. తెల్లవారు జాము నుంచి స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు.

పేద విద్యార్థికి వాసుపల్లి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయాగా పని చేస్తున్న మీసాల సంధ్య కుమార్తె మీసాల హాసిని కళాశాల ఫీజు కోసం రూ.10 వేలు తన సొంత నిధుల నుంచి అందజేశారు. 30వ వార్డు రెల్లివీధి కుంచుమాంబ గుడి వద్ద నివాసం ఉంటున్న ఆ పేద కుటుంబానికి ఆశీల్‌మెట్ట సమీపాన తన కార్యాలయంలో ఆ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి విద్యార్థి హాసినితో మాట్లాడుతూ బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. మన దేశంలో పురుషులకు మించి మహిళలు ఉన్నత శిఖరాలు అధిరోహించడంలో ముందుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో లండా రమణ, సుబ్రహ్మణ్యం (సువార్త రాజు), ముత్తాబత్తుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన పాల రేట్లు తగ్గించాలి

సీపీఎం డిమాండ్

డాబాగార్డెన్స్: విశాఖ డెయిరీ యాజమాన్యం ఏకపక్షంగా పాల ధర లీటరుకు రూ.2 పెంచేసిందని, ఈ నెల 10 నుంచి పెంచిన రేట్లు అమల్లోకి తీసుకొచ్చారని, ఈ పెంపును సీపీఎం విశాఖ జిల్లా కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తక్షణం కూటమి ప్రభుత్వం జోక్యం చేసుకుని భారీగా పెంచిన పాల రేట్లను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఏడాది కిందటే లీటర్ పాల ధర రూ.2 పెంచేసిందని, ఈ పెంపుదలను టీడీపీ, జనసేన, బీజేపీలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది గడవక ముందే మరో రూ.2 లీటర్‌కి పెంచడం దుర్మార్గమన్నారు. పైపెచ్చు రైతులకు లీటర్ పాల సేకరణ ధరను రూ.3కి తగ్గించారని, ప్రస్తుతం రైతుల నుంచి సేకరించే లీటరు పాల సేకరణ ధరకు, వినియోగదారులకు విశాఖ డెయిరీ అమ్మే ధరకు రూ.20 వ్యత్యాసం ఉందన్నారు. కానీ వినియోగదారులకు మాత్రం గత ఏడాది కాలంలో లీటర్ పాల ధర రెండు సార్లు రూ.2 చొప్పున రూ.4 పెంచడమంటే ప్రజలపై తీవ్రభారం మోపడమేనన్నారు. ఈ పెంపుదల వల్ల ప్రజలపై రూ.6 కోట్ల భారం పడతుందని, ఇప్పటికే ఆస్తి పన్నులో మార్పు చేసి ప్రతి ఏడాది 15 శాతం చొప్పున ఆస్తి పన్ను పెంచుతున్నారని, నిత్యావసర సరుకులన్నీ ఆకాశాన్ని అంటుతున్నాయని చెప్పారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు నిత్యం పెంచుకుంటూ పోతున్నారని, విద్యా, వైద్య ఖర్చులు పెరిగిపోయాయన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతున్నారని, ఈ నేపథ్యంలో పాల ధర పెంచడం ప్రజల జీవితాలు మరింత దుర్భరం చేయడమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని, పెంచిన రేట్లను తగ్గించాలని సీపీఎం డిమాండ్ చేస్తుందన్నారు.

ట్రాఫిక్ కంట్రోల్ రూమ్ ప్రారంభం




ట్రాఫిక్ కంట్రోల్ రూమ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చీ తదితరులు

అల్లిపురం: పూర్ణామార్కెట్ వద్ద ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌ను పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ సిబ్బంది 24 గంటలు పూర్ణామార్కెట్ ప్రాంతంలో విధులు నిర్వహించేందుకు అనుకూలంగా ట్రాఫిక్ వలంటీర్ ఆలివ్ సతీష్ సహకారంతో ట్రాఫిక్ సబ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ఆయన పూర్ణామార్కెట్‌లో పర్యటించారు. అక్కడి వ్యాపారులు, వినియోగదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన జీవీఎంసీ, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ విభాగాల ద్వారా ద్విచక్ర వాహనాలు, ఫోర్ వీలర్స్ పార్కింగ్ చేసుకునే విధంగా మార్కింగ్ చేయించి, బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏడీసీపీ కె. ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవ్, ట్రాఫిక్ సీఐలు షణ్ముఖరావు, శ్రీనివాసరావు, వన్‌టౌన్ లా అండ్ ఆర్డర్ సీఐ జీడీ బాబు, ట్రాఫిక్ ఎస్సైలు విశ్వనాథం, లక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పౌర్ణమి పూజలకు వేళాయె

రేపు సత్యదేవుని ఆలయంలో వేడుకలు



ఇసుక కొండపై వెలసిన స్వామి ఆలయం

డాబాగార్డెన్స్: ఇసుకకొండ (బాబాజీ కొండ)పై వెలసిన శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో ఈ నెల 12న వైశాఖ పౌర్ణిమను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. లోక కల్యాణం, విశ్వశాంతిని కాంక్షిస్తూ వేకువ జాము నుంచి ప్రత్యేక పూజలు, సామూహిక, విశేష వ్రతాలు జరపనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రానున్న దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో టి. రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశామని, క్యూలైన్లలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వాహనాలపై వచ్చే భక్తులు కేజీహెచ్ వైపు నుంచి వచ్చే వాహన మార్గం మూసి వేయడం దృష్ట్యా భక్తులు పూర్ణామార్కెట్‌కు ఎదురుగా ఉన్న ఘాట్‌రోడ్ నుంచి మాత్రమే ఆలయానికి రావాలని ఈవో పేర్కొన్నారు.

పూజలు ఇలా..

తెల్లవారు జాము 2.30 గంటలకు స్వామి ఆరాధన కార్యక్రమం అనంతరం 4 గంటలకు ధ్వజస్తంభ పూజలు జరపనున్నారు. అనంతరం 4.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4.30 నుంచి రాత్రి 10.30 గంటల వరకు భక్తులకు స్వామి దర్శనం కల్పించనున్నారు. ఉదయం 4 గంటలకు నిర్వహించే ధ్వజస్తంభ పూజకు రూ.1,116 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఉదయం 7, తిరిగి 10.30 గంటలకు నిర్వహించే ప్రత్యేక వ్రతంలో పాల్గొనదలిచే దంపతులు రూ.1,116 చెల్లించి పూజలో పాల్గొనవచ్చు. అలాగే ఉదయం 8.30 గంటలకు నిర్వహించే సామూహిక వ్రతంలో పాల్గొనదలిచే భక్తులు రూ.516 చెల్లించి పూజలో పాల్గొనవచ్చు.



రమా సహిత సత్యనారాయణ స్వామి